క్లుప్తంగా

నేడు ఆధార్ క్యాంప్‌లకు చివరి గడువు

పుల్లలచెరువు: గ్రామాల్లో ఇటీవల జిల్లా అధికారులు ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాల క్యాంపులు శనివారంతో ముగియనున్నాయని ఎంపీడీవో వసంతరావు నాయక్ తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ మండలంలోని కొన్ని సచివాలయాల్లో ఇటీవల ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేశామని, వాటి సేవలు ఈ నెల 22వ తేదీతో ముగుస్తాయన్నారు. ఆధార్ లేని వారు, తప్పులు ఉన్న వారు శనివారం లోపు మార్పులు చేసుకోవాలన్నారు. పుల్లలచెరువు సచివాలయం-2లో నిరంతరం ఆధార్ ప్రక్రియ కొనసాగుతోందని, ప్రజలు ఈ విషయం గమనించాలని ఆయన సూచించారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ముండ్లమూరు (దర్శి): కేజీబీవీల్లో ప్రవేశాల కోసం ఈ నెల 22వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆవుల సునీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి, ఇంటర్ ఎంపీసీలో ప్రవేశాల కోసం , 7, 8, 9, 10, 12వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులు ఈ నెల 22వ తేదీ నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని చెప్పారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే అడ్మిషన్‌లకు పరిగణిస్తామని ఆమె స్పష్టం చేశారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందని ప్రిన్సిపాల్ చెప్పారు.


తోకపల్లి పొలంలో పండుబారిన వంకాయలు


పశువుల మేతకు కుప్పగా పోసిన వంకాయలు

కష్టమంతా నేలపాలు

● నష్టాలబాటలో వంకాయల రైతులు

పెద్దారవీడు: ఈ ఏడాది అన్నదాతకు ఏ పంటా కలిసి రావడం లేదు. కూటమి ప్రభుత్వం అన్నదాతలను విస్మరించడంతో నష్టాలు మూట గట్టుకుంటున్నారు. కొన్ని పంటల దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా ధర లేకపోవడంతో రైతులు అప్పులపాలవుతున్నారు. మండలంలోని తోకపల్లిలో దాదాపు 50 ఎకరాల్లో వంకాయల పంట సాగు చేశారు. రబీ పంట కింద సాగు చేసిన వంకాయలు కోతకు వచ్చాయి. సాగు సమయంలో ఉన్న ధరలు పంట చేతికొచ్చే సమయానికి పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వేలల్లో పెట్టుబడులు పెడుతున్నా ధరలు ఉన్నట్టుండి పడిపోవడంతో గిట్టుబాటు కానీ పరిస్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. చెమటోడ్చి పండించిన వంకాయలు దిగుబడి బాగున్నా ధరలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమయంలోనే ధర పతనం కావడంతో రైతులకు పెట్టుబడి కూడా చేతికందడం లేదు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు కనీస ధర లేకపోవడంతో వంకాయలు రోడ్డుపాలు చేయాల్సి వస్తోంది. రైతుల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోంది. గతేడాది మంచి లాభాలు రావడంతో ఈ ఏడాది కూడా వంగ పంటను సాగు చేశామని రైతులు తెలిపారు. పంట చేతికి రాగానే గిట్టుబాటు ధర వస్తుందనే ఆశతో రైతులు సాగు చేశారు. ఎకరాకు దాదాపు రూ.50 నుంచి రూ.60 వేలు ఖర్చు వస్తుంది. మార్కాపురం మార్కెట్లో వంకాయలు అడిగే దిక్కు లేకపోవడంతో గుంటూరు మార్కెట్‌కు ట్రాలీ ఆటోల్లో తరలిస్తున్నారు. అయితే పంట సాగుకు వేలకు వేలు పెట్టుబడి పెట్టి పండించిన వంకాయలు గుంటూరు మార్కెట్లో 60 కిలోల బస్తా ధర రూ.300 పలకడంతో రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. కనీసం వంకాయలు కోసిన కూలీ, రవాణ ఖర్చులు కూడా గిట్టుబాటుగాక కోయకుండానే పొలంలోనే వదిలేస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 60 కిలోల బస్తా ధర రూ.1200 పలికితే కొంత మేర గిట్టుబాటుతో అప్పుల నుంచి బయటపడతామని రైతులు చెబుతున్నారు. కొంత మంది పొలం దున్నేందుకు సిద్ధంగా ఉన్నారు. పంటకు పెట్టిన పట్టుబడి రాక అప్పులు ఎలా తీర్చాలో అర్థంగాక దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నామని వాపోతున్నారు. ధరలు పడిపోయి రైతులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నా పాలకులు దృష్టి సారించక పోవడం శోచనీయం. ప్రభుత్వం స్పందించి కనీస మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

అప్పుల పాలవుతున్నాం:



ఎకరా పొలంలో వంగ పంట సాగు చేశా. దాదాపు రూ.50 వేల పెట్టుబడి పెట్టా. మార్కాపురం మార్కెట్లో వ్యాపారులు వంకాయలు కొనుగోలు చేయడం లేదు. దీంతో గుంటూరు మార్కెట్లో ఆటోల్లో తరలిస్తున్నాం. అక్కడ వ్యాపారులు 60 కేజీల బస్తా రూ.300 కొనుగోలు చేస్తున్నారు. కోత కూలీ, రవాణా ఖర్చులు రాకపోవడతో పొలంలోనే కాయలు వదిలేశా. పంట సాగుకు పెట్టిన పెట్టుబడి రాక అప్పులపాలయ్యా. ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలి.

– జిల్లెల వెంకటేశ్వరరెడ్డి, తోకపల్లి

బూచేపల్లి వెంకాయమ్మ ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ


వెంకాయమ్మను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దర్శి: శ్రీ సువర్చలా సమేత ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. వెంకాయమ్మకు ఆలయ కమిటీ ఆహ్వానం పలికింది. కమిటీ సభ్యులు ఆమెను ఘనంగా సన్మానించారు. అనంతరం వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీని ప్రారంభించారు. పట్టణ అధ్యక్షుడు ముత్తినీడి సాంబయ్య, మాజీ ఎంపీటీసీ ముత్తినీడి శిరీషా దంపతుల ఆధ్వర్యంలో కురిచేడు రోడ్డు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అక్కడ అల్పాహారం పంపిణీని ప్రారంభించారు. అనంతరం వెంకాయమ్మను ఘనంగా సత్కరించారు. మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ మాజీ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కేసరి రాంభూపాల్‌రెడ్డి, కల్లూరి విద్యాసాగర్, సురేష్, అన్నవరపు రవి పాల్గొన్నారు.

కార్యకర్త మృతికి ఎమ్మెల్యే తాటిపర్తి నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: మండలంలోని వీరభద్రాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త దొరడ్ల చిన్న పిచ్చయ్య మృతికి ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ నివాళులర్పించారు. ఈ మేరకు శుక్రవారం పిచ్చయ్య మృతదేహానికి ఆయన పూలమాలవేసి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం పట్టణంలో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ మస్తాన్, షేక్ రసూల్ గృహాలకు ఎమ్మెల్యే వెళ్లి పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఇందిరా నగర్‌లో నూతనంగా నిర్మించిన మసీదును సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, జిల్లా కార్యదర్శి కె.ఓబులరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఏకుల ముసలారెడ్డి, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, మండల పరిషత్ వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, షేక్ వలి, లియాఖత్, షేక్ కాశింపీరా పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలి

● ఎస్పీ ఏఆర్ దామోదర్


స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

తాళ్లూరు: మహిళల భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసులను వేగవంత చేసి పరిష్కరించాలన్నారు. తొలుత రికార్డులు, స్టేషన్ పరిసరాలు పరిశీలించారు. అనంతరం రోడ్డు భద్రత నియమాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. పోలీసుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటానని ఎస్పీ స్పష్టం చేశారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫిర్యాదులు పరిష్కరించాలని సూచించారు. ఎస్పీ సీఐ రాఘవేంద్ర, ఎస్సై ఎస్.మల్లికార్జునరావు, హెడ్ కానిస్టేబుల్ ఎం.రమేష్, డి.బ్రహ్మనాయుడు టి.సాంబశివ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ కవితా దినోత్సవం


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

దర్శి: మండలంలోని తూర్పు వీరాయపాలెం ఎంపీయూపీ పాఠశాలలో 125వ ప్రపంచ కవితా దినోత్సవం ఉపాధ్యాయురాలు మస్తాన్ బీ అధ్యక్షతన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విశ్వ కవి రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. విద్యార్థులకు కవితల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మీనిగ శ్రీనివాస్ మాట్లాడుతూ విశ్వవ్యాప్త ప్రతికూల అంశాలను మార్చగలిగే శక్తి ఒక్క కవికే ఉందన్నారు. విద్యార్థులు కవితలు, రచనలు చదవాలని ఉద్బోధించారు. ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు బి.నాగార్జున, విక్రం, సీనియర్ ఉపాధ్యాయులు దేవదాసు, ఏకేఎస్ ట్రస్ట్ ప్రతినిధి అట్లూరి రామారావు పాల్గొన్నారు.

మిర్చిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

పుల్లలచెరువు: క్వింటా మిర్చికి రూ.21 వేలు మద్దతు ధర ప్రకటించి నేరుగా రైతుల నుంచి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.రఘు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మాట్లాడుతూ రాష్ట్రంలో రోజురోజుకూ రైతులకు కష్టాలు ఎక్కువ అవుతున్నాయని పేర్కొన్నారు. ఎండు మిర్చి ధరలు పూర్తిగా పడిపోతున్నాయన్నారు. నేడు ఉన్న రేటు రేపు ఉండటం లేదని విచారం వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ప్రభుత్వం కల్పించకుంటే రైతులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. ఎకరం పొలంలో మిర్చి పండించేందుకు రూ.2.50 లక్షల పెట్టుబడి అవుతుందని, తీరా చూస్తే రైతులకు ఏమీ మిగలడం లేదన్నారు. కౌలు రైతుల పరిస్థితి దారుణంగా ఉందని విచారం వ్యక్తం చేశారు.

చిన్నారుల మృతిపై బూచేపల్లి విచారం


చిన్నారులకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కురిచేడు: స్థానిక పడమర హరిజనవాడలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు చిన్నారులు చెరువులో మునిగి మృతి చెందడంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి నియోజకవర్గ శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలు విచారం వ్యక్తం చేశారు. ఒకే కుటుంబం ఇద్దరు చిన్నారులను కోల్పోవడం బాధాకరమని, ఈ సంఘటన తమ హృదయాన్ని కలచి వేసిందన్నారు. నాయకులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. శుక్రవారం తమ ప్రతినిధులను పంపి ఆ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారికి ఆర్థిక సాయం అందజేశారు. జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గోగులమూడి లింగారెడ్డి, మాజీ సర్పంచ్ పోతిరెడ్డి నాగిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ గుంటక నాసరరెడ్డి, నాయకులు అంకె గోపాలకృష్ణ, నుసుం సుబ్బారెడ్డి, సోషల్ మీడియా ప్రచార కమిటీ అధ్యక్షుడు కోలా సంతోష్‌కుమార్ ఉన్నారు.




ఘనంగా ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల


లక్ష తమలార్చన చేస్తున్న పురోహితులు

● భారీగా హాజరైన భక్తులు
● పోలీసుల పటిష్ట బందోబస్తు


పూజలందుకుంటున్న ప్రసన్నాంజనేయ స్వామి


విద్యుత్ కాంతులతో వైఎస్సార్ సీపీ ప్రభ

దర్శి: శ్రీ సువర్చలా సమేత ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ 55వ వార్షిక తిరునాళ్ల శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పురోహితులు ఓరుగంటి వెంకటరమణయ్య శర్మ ఆధ్వర్యంలో ముందుగా గణపతి పూజ నిర్వహించి స్వామివారికి మహన్యాస పూర్వక మహా రుద్రాభిషేకం చేశారు. అనంతరం శ్రీసూక్తం, పురుషసూక్తం, సుందరాకాండ పారాయణం, లక్ష తమలార్చన, స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో స్వామి వారికి మహిళలు పొంగళ్లు పొంగించి నివేదన చేశారు.

భారీగా హాజరైన భక్తులు

వేలాది మంది భక్తులు హాజరై తెల్లవారు జాము నుంచే క్యూలైన్‌లో బారులు తీరారు. భక్తులు స్వామి వారికి నివేదన చేసి పొంగళ్లు, కేసరి, పులిహోర స్టాల్స్ ఏర్పాటు చేసి భక్తులకు పంపిణీ చేశారు. ఎండ తీవ్రతకు భక్తుల సౌకర్యార్థం మజ్జిగ పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభ ఏర్పాటు చేశారు. చెరుకుల బండ్లు, మిఠాయి దుకాణాలు, బొమ్మల దుకాణాలతో తిరునాళ్ల వాతావరణం సంతరించుకుంది.


క్యూలైన్‌లో బారులుదీరిన భక్తులు

రారండోయ్ వేడుక చూద్దాం..

● వరాల కొండ 'వెలుగొండ' ● నేడు గజోత్సవం, తిరునాళ్ల
● రేపు శ్రీవారి రథోత్సవం

కొనకనమిట్ల: బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కొనకనమిట్ల మండలంలోని వెలుగొండ పుణ్యక్షేత్రంలో ఆధ్యాత్మికత నెలకొంది. ప్రధాన తిరునాళ్లకు వెలుగొండ క్షేత్రం ముస్తాబైంది. ఏటా ఫాల్గుణ శుద్ధ త్రయోదశి మొదలు బహుళ ఏకాదశి వరకు బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. శనివారం గజోత్సవం, తిరునాళ్ల సందర్భంగా ఎడ్ల పోటీలు, రాత్రికి విద్యుత్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు పౌరాణిక నాటకాలు ఏర్పాటు చేశారు. ఆదివారం శ్రీవారి రథోత్సవం వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం ఈఓ చెన్నకేశవరెడ్డి, సేవా కమిటీ అధ్యక్షులు కుందురు కాశిరెడ్డి తదితరుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. శని, ఆదివారాల్లో జాతీయ స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు.


గరుడోత్సవంలో శ్రీవారు(ఫైల్)

ఆలయ చరిత్ర ఘనం

ఈ క్షేత్రం ముసి నది ఉద్భవించిన పవిత్ర ప్రాంతం. స్వామి వారి పాదాల చెంత నుంచి ముసి నది ప్రవహిస్తుంది. ఇక్కడ ముచుకుంద మహర్షి తపస్సు చేస్తున్నప్పుడు సాక్షాత్తు శ్రీకృష్ణుడు శ్రీమన్నారాయణుని అవతారంలో ప్రత్యక్షమై.. మహర్షి కోరిక మేరకు వెంకటేశ్వరుని రూపంలో కొలువుదీరి పూజలందుకుంటున్నారని భక్తుల విశ్వాసం. వెలుగొండకు కొద్ది దూరంలో బండరాతిలో లక్ష్మమ్మ దొన, నిచ్చెనల దొనలు ఉన్నాయి. మండు వేసవిలోనూ వాటిలో నీరు ఉండటం విశేషం. శ్రీవారిపై అలిగిన ఆయన సతీమణి కొండపైకి చేరగా పీఠ మీద లక్ష్మమ్మగా భక్తుల పూజలందుకుంటున్నారు.

దేవస్థానానికి వెళ్లే మార్గం

పొదిలి నుంచి పూర్కాపురం వెళ్లే మార్గంలో నాగిరెడ్డిపల్లి వద్ద నుంచి నాలుగు కిలోమీటర్లు దక్షిణం వైపు ప్రయాణిస్తే వెలుగొండ పుణ్యక్షేత్రం వస్తుంది. పొదిలి-గిద్దలూరు రహదారిలో గొట్లగట్టు నుంచి 12 కిలోమీటర్ల దూరం ప్రయాణించి వెలుగొండ చేరుకోవచ్చు. బ్రహ్మోత్సవాల సందర్భంగా శని, ఆదివారాల్లో పొదిలి, పూర్కాపురం, కనిగిరి డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.


శ్రీవారి రథోత్సవం(ఫైల్)


ముస్తాబైన వెలుగొండ దేవాలయం